ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 10 సెప్టెంబరు 2024 | 5



రైతులు భూమిని గౌరవంగా భావిస్తారు.. తల్లిదండ్రులతో సమానంగా చూస్తారు..కానీ గోదారమ్మ రైతుల భూములను తనలో కలిపేసుకుంటోంది.. 'రాజు'లా బతికే రైతును బీదగా మారుస్తోంది.. కళ్లెదుటే విలువైన భూమి నదీగర్భంలో కలిసిపోతున్నా కన్నీళ్లు కారుస్తూ చూడడం తప్పా ఏమీ చేయలేని పరిస్థితి రైతులది.. ప్రభుత్వాలు నడుంబిగిస్తేనే కానీ భూమికి రక్షణ ఉండదు.. కానీ ప్రభుత్వాలు మారుతున్నా రైతు గోడును పట్టించుకునేవారే కరువయ్యారు..జాప్యం చేసి చేసి.. 'గోదారమ్మ'కు రైతుల భూములను అప్పగించేస్తున్నారు...



రైతుకు కలిసిరాని
తమలపాకు

పెరిగిన ఖర్చులు.. పెరగని ధరలు ● కొన్ని ఎకరాలకే సాగు పరిమితం

రావులపాలెం, సెప్టెంబరు 9: తమలపాకు అందరి నోర్లు పండిస్తున్న సాగు చేసే రైతు బతుకు మాత్రం పండటం లేదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురం లంక ప్రాంతం తమలపాకు సాగుకు అనుకూలంగా ఉండటంతో ఇక్కడ రైతులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా రైతులు వచ్చి లంక పొలాలను కౌలుకు తీసుకుని తమలపాకు సాగుచేసేవారు. జిల్లాలోని ఒక్క గోపాలపురంలోనే 300 నుంచి 400 ఎకరాలలో తమలపాకు సాగు జరిగేది. దీంతో పాటు పి.గన్నవరం మండలంలోని కొన్ని లంక ప్రాంతాల్లో, తుని సమీపంలో తమలపాకు సాగు చేస్తున్నారు. 20 ఏళ్లుగా సాగు చేస్తున్నప్పటికీ వరదల కారణంగా కొంత మేర నష్టం వచ్చినా తర్వాత తమలపాకుల దిగుబడి బాగుండి ధర పెరగడంతో రైతులు సాగు వైపు మొగ్గు చూపేవారు. అయితే కరోనా సమయంలో రెండేళ్లు ఆకులు కోసే పరిస్థితి కూడా లేకపోవడంతో పెట్టుబడి పెట్టిన లక్షలాది రూపాయలను రైతులు తీవ్రంగా నష్టపోయారు. అనంతరం శిస్తులు, పెట్టుబడులు, కూలీల ఖర్చులు భారీగా పెరగడంతో రైతులు తమలపాకుల సాగుకు మొగ్గుచూపడంలేదు. దీంతో సాగు సగానికి పైగా తగ్గిపోయింది. అయితే గత ఏడాది శ్రావణమాసంలో 20 మొదల తమలపాకుల బుట్ట రూ.1000 నుంచి రూ.1200 పలకగా ప్రస్తుతం రూ.600 నుంచి రూ.700 పలుకుతుంది. దీనికి తోడు తెగుళ్ల బెడద కారణంగా దిగుబడి కూడా కొంత మేర తగ్గింది. ఈ ప్రాంతం తమలపాకులు నాగపూర్, తెలంగాణ, మన రాష్ట్రంలోని పలు జిల్లాలకు పార్సిల్ ద్వారా ఎగుమతులు చేసి విక్రయాలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు కృష్ణాజిల్లా ముంపులో చిక్కుకోవడంతో ప్రస్తుతం ఎగుమతులు కూడా తగ్గాయి. వరుస నష్టాలు చవిచూడాల్సి రావడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు.





సలాదివారిపాలెంలో కోతకు గురవుతున్న లంక భూమి

● (ముమ్మిడివరం)



కోతకు గురవుతున్న కొబ్బరితోటలు



లంకాఫ్‌ఠాణేలంక గుత్తాలవారిపేటలో కోతకు గురైన ఇళ్లు



లంకాఫ్‌ఠాణేలంక గుత్తాల వారిపేటలో కోతకు గురవుతున్న ఇళ్లు

లంక గ్రామాల కోత



అయినవిల్లిలో కోతకు గురవుతున్న లంక భూమి

గ్రామాల స్వరూపమే మాయం

లంక గ్రామాల రైతుల ఆవేదన వర్ణనాతీతం
ప్రతీ ఏడాది నష్టాలపాలే..
భూములు కోల్పోయి కూలి పనులకు..

ముమ్మిడివరం మండలం కమిని, లంకాఫ్ ఠాణేలంక గ్రామాలు గోదావరి నదీ పాయల మధ్య ఉండే గ్రామాలు. 3015 ఎకరాల భూమి ఉండేది. ఈ గ్రామంలోని గురజాపులంక, సలాదివారిపాలెం, వలసలతిప్ప గ్రామాలు చాలావరకు నదీకోతకు గురయ్యాయి. ప్రస్తుతం పొట్టితిప్ప, గురజాపులంక గ్రామాలు కోతకు గురవుతున్నాయి. గ్రామంలో 1900 ఎకరాల భూమి నదీపాతమైంది. ఇంకా 1100 ఎకరాల భూమి మాత్రమే మిగిలి ఉంది. ఆ గ్రామంలో పంచాయతీ కార్యాలయం, కచేరీ చావిడి, రామాలయం, మండువా లోగిళ్లు, మంచినీటి బావులు సైతం నదీగర్భంలో కలిసిపోయాయి. దీంతో పలు కుటుంబాలు వలసలు వెళ్లిపోయాయి. ప్రస్తుతం 264 కుటుంబాలకు చెందిన 1020 మంది ఉన్నారు. లంకాఫ్‌ఠాణేలంక గ్రామంలో గతంలో ఠాణేలంకలో అంతర్భాగంగా ఉండేది. ఠాణేలంక నుంచి పళ్లవారిపాలెం పంచాయతీ ఏర్పడిన తర్వాత పళ్లవారిపాలెం, లంకాఫ్‌ఠాణేలంక పంచాయతీలు ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పడ్డాయి. గ్రామంలో 600 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా 792 కుటుంబాలకు చెందిన 2378 మంది జనాభా ఉన్నారు. ఇటీవల 200 ఎకరాల వ్యవసాయ భూమి కోతకు గురైంది. గత 20 నుంచి 30 సంవత్సరాల్లో ప్రతీ ఏటా వచ్చే వరదల్లో ఎంతో కొంత భూమి వరదలకు గురవుతూ వస్తుంది. దీంతో ఆయా గ్రామాల స్వరూపమే మారిపోయింది.

నదీ గర్భంలోకి విలువైన భూములు

లంక భూముల నదీ కోత నివారణకు కూటమి ప్రభుత్వం రూ.230 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. గోదావరి నదికి వరదలు సంభవించినప్పుడల్లా ఏటా లంక గ్రామాల్లో విలువైన భూములు, నివాస గృహాలు, కొబ్బరి తోటలు నదీ కోతకు గురవుతున్నాయి. కూటమి ప్రభుత్వం ముమ్మిడివరం నియోజకవర్గంలో నాలుగు కిలోమీటర్ల మేర లంక భూముల రక్షణకు రూ.230 కోట్లతో రివిట్‌మెంట్, పిచ్చింగ్ వంటి రక్షణ చర్యలు చేపట్టనుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ముమ్మిడివరం, అయినవిల్లి మండలాల్లో లంక భూముల రక్షణకు 3.700 కిలోమీటర్లు రివిట్‌మెంట్, పిచ్చింగ్ వంటి పనులకు ప్రతిపాదనలు రూపొందించినా అవి కార్యరూపం దాల్చలేదు. గత ఏడాది ఆగస్టు 8న వరద బాధితులను పరామర్శించేందుకు విచ్చేసిన నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రక్షణ చర్యలకు హామీ ఇచ్చినా నెరవేర్చలేకపోయారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు లంక గ్రామ వాసులకు భూముల రక్షణకు చర్యలు చేపడతామని ఇచ్చిన హామీలో భాగంగా రూ.230 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. గురజాపులంక-కూనాలంక మధ్య రెండు కిలోమీటర్ల మేర రక్షణ చర్యలకు రూ.కోటి 20లక్షలు, సలాదివారిపాలెం వద్ద 1500 మీటర్ల మేర రక్షణ చర్యలకు రూ.80 లక్షలు, ఐ.పోలవరం మండలం మురమళ్ల వద్ద 500 మీటర్ల రక్షణకు రూ.30 కోట్లు ప్రతిపాదనలు రూపొందించారు. వైసీపీ హయాంలో ఐ.పోలవరం మండలం రామాలయం వద్ద కిలోమీటరు మేర రివిట్‌మెంట్, పిచ్చింగ్ వంటి పనులకు రూ.79 కోట్లతో చేపట్టిన పనులు కేవలం 300 మీటర్లు మాత్రమే జరిగాయి.

గోదావరికి వరదలు వచ్చినప్పుడల్లా నదీ పరివాహక ప్రాంతాల్లోని నివాస ప్రాంతాలు, గుడులు, బడులు, విలువైన భూములు కోతకు గురవుతూనే ఉన్నాయి. దీంతో ఏటా ఎంతో కొంత భూమి నదీపాతానికి గురవుతుంది. కాలక్రమేణా లంక గ్రామాలు నదీగర్భంలో కలిసిపోతున్నాయి. అక్కడ ప్రజలకు గుండెకోత మిగులుతుంది. కొన్ని గ్రామాలు చిత్రపటం నుంచి కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది.

రక్షణ చర్యలు చేపట్టాలి



గతంలో మాకు పెద్ద మండువా ఇల్లు ఉండేది. ఆ ఇల్లు గోదావరి నదీ గర్భంలో కలిసిపోయింది. 80 సెంట్ల భూమి నదీపాతమైంది. గ్రామంలో విలువైన భూములు, ఆలయాలు నదిలో కలిసిపోయాయి.

సలాది సూర్యనారాయణ, రైతు

20 సెంట్లు మిగిలింది



నాకు లంక గ్రామాల్లో రెండు ఎకరాల భూమి ఉండేది, వరదలకు 80 సెంట్లు భూమి నదీ పాతమైంది. ఇక ఎకరా 20 సెంట్లుమిగిలింది. రక్షణ చర్యలు చేపట్టకపోతే లంక భూములు నదీపాతానికి గురయ్యే ప్రమాదం ఉంది. కూనాలంక వద్ద గోదావరి ప్రవాహానికి లంక భూమి కోతకు గురవుతుంది.

సలాది సత్యనారాయణ, కూనాలంక,

ఇక వలసే గతి



నాకు గ్రామంలో 15 కుంచాల భూమి ఉండేది. ఎకరం నదీపాతమైంది. ఇక 50 సెంట్లు మిగిలింది. కౌలుకు భూమి తీసుకుని సాగు చేస్తున్నాను. ప్రభుత్వాలు ప్రతిసారి ఏదో ఒకటి చేస్తామని చెప్పడమే.. ఇకనైనా రక్షణ చర్యలు తీసుకోకుంటే ఇక వలసే గతి..

సలాది వీరవెంకటసత్యనారాయణ, సలాదివారిపాలెం

భూమంతా పోయింది



నాకు గతంలో ఎకరం లంక భూమి ఉండేది. వరదలకు ఆ భూమి అంతా నదీ గర్భంలో కలిసిపోయింది. గేదెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాను.

పాము సత్యనారాయణ, వలసలతిప్ప

గురుకుల పాఠశాలలో
కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



బాత్‌రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్

అమలాపురం రూరల్, సెప్టెంబరు 9: వర్షాల సీజన్ కావడంతో విద్యార్థులకు అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. సమనస మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులు చదువుకునే తరగతి గదులు, నిద్రించే గదులు, మరుగుదొడ్లు, వంటశాల, తాగునీటి ప్లాంట్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. టాయిలెట్ల వద్ద పరిశుభ్రత పాటించడంతో పాటు చెడు వాసన రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వైటీఎస్ రాజు విద్యార్థుల వివరాలతో పాటు పూర్తి సమాచారాన్ని కలెక్టర్‌కు అందించారు. తరగతి గదిలోని డిజిటల్ క్లాస్ బోర్డును పరిశీలించి విద్యార్థులకు సిలబస్ ఎంత వరకు పూర్తి అయిందని ప్రశ్నించారు. ప్రధానంగా పాఠశాల పరిసరాలతో పాటు విద్యార్థులు నిద్రించే గదులు, టాయిలెట్లు, వంటశాలల్లో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున పాఠశాల ఆవరణలో నీరు చేరి దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మరుగుదొడ్లు, స్నానాల గదులకు మరమ్మతులు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు వడ్డించే ఆహారం కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, మంచినీటి ప్లాంట్లను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ రక్షిత మంచినీరు అందించాలన్నారు. సకాలంలో సిలబస్‌ను పూర్తిచేసి ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

గ్రీవెన్స్‌కు 115 అర్జీలు

జేసీ నిషాంతి ఆధ్వర్యంలో అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ నిషాంతి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 9: అధికారులు అంకితభావంతో పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు అధిక ప్రాధాన్యతనిచ్చి సమస్యలను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏ స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను ఆ స్థాయిలోనే పరిష్కార మార్గాలు చూపాలన్నారు. జిల్లా కేంద్రం వరకు అర్జీదారులు రావాల్సిన అవసరం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ నిషాంతితో పాటు డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదనరావు, ఎస్‌డీసీ వి.మదన్‌మోహనరావు, జిల్లా స్త్రీశిశుసంక్షేమశాఖ అధికారి ఎం.ఝాన్సీరాణి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 115 అర్జీలు స్వీకరించారు. ఒకసారి సమర్పించిన అర్జీ తిరిగి పునరావృతం కాకుండా జిల్లాస్థాయి అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. మండల స్థాయిలో సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బి.బోసుబాబు, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాస్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కార్తీక్‌రెడ్డి, డీఈవో ఎం.కమలకుమారి, డీఎస్‌వో ఎస్.పాపారావు, డీపీవో డి.రాంబాబు, సీపీవో వెంకటేశ్వర్లు, డీఐపీఆర్వో కె.లక్ష్మీనారాయణ, వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణారావు

పోలీస్ గ్రీవెన్స్‌కు పలు అర్జీలు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 9: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ బి.కృష్ణారావు పాల్గొని అర్జీలు స్వయంగా స్వీకరించారు. అర్జీదారుల సమస్యలు విన్నారు. వివిధ సమస్యలపై పది అర్జీలు ఆయన స్వీకరించారు. చట్టానికి లోబడి ఆయా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



7

తరలివచ్చిన భక్తజనం

దయచూడు వినాయకా..

అయినవిల్లిలో కొనసాగుతున్న చవితి వేడుకలు

వీఆర్‌కు రామచంద్రపురం ఎస్ఐ?

దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోనే చిరుత

వార్తలు..7వ పేజీలో

మీకు నేనున్నా..

బురదలో తిరుగుతూ.. జనం కష్టాలు వింటూ.. సమస్యలు తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్

ఏలేరు ఉప్పొంగింది.. గ్రామాలను ముంచెత్తింది.. ఎటు చూసినా నీరే.. అడుగు తీసి అడుగు వేయలేం.. సామాన్యులైనా వెళ్లడం కష్టమే.. అటువంటిది డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అడుగేశారు.. ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు మడుగులా ఉన్న బురదలో దిగారు.. సమస్యలు విన్నారు.. మీకు నేనున్నానంటూ భరోసాగా నిలిచారు. కాకినాడ జిల్లాలో ఏలేరు వరదేరుగా మారింది. నాలుగేళ్ల తర్వాత ఉగ్రరూపం దాల్చింది. సోమవారం ఒక్కరోజే ఆ జిల్లాలోని ఏడు మండలాల్లో 22 వేల ఎకరాలకు పైగా ముంచేసింది. ఇళ్లనూ చుట్టేసింది. సోమవారం అర్ధరాత్రి గొల్లప్రోలు టోల్‌గేట్‌కు ముందు, వెనుక వరద నీరు హైవేపైకి వచ్చేసింది. ఈ మేరకు సమా చారం అందుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హుటాహుటిన గొల్లప్రోలులో వరద ప్రాంతాలకు చేరుకు న్నారు. బుర దలోనే నడుచుకుంటూ, బోటు ఎక్కి నీటమునిగిన పేదల ఇళ్ల కాలనీకి వెళ్లారు.ఆదుకుంటామని బాధితుల కు భరోసా ఇచ్చారు. మరో పక్క వర్షాలతో అనేకచోట్ల రహదారులపై పదడు గుల ఎత్తులో నీరు ప్రవహిస్తుండడం తో రాకపోకలు నిలిచిపోయాయి. తుని-నర్సీపట్నం రోడ్డులో ఆర్టీసీ సర్వీసులు నిలిపివేసింది.

గొల్లప్రోలు, సెప్టెంబరు 9: ఏలేరు రిజర్వాయర్ కన్నెర్ర జేసింది. కాకినాడ జిల్లా పరిధిలోని ఏడు మండలాల్లో వరద ముంచెత్తింది. పిఠాపురం నియోజకవర్గంలో వరద ప్రభావంతో కొన్ని కాలనీలు నీటమునగగా, వేలాది ఎకరాల్లో పంట వరద పాలైంది. ఈమేరకు సమాచారం అందుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం హైదరాబాదు నుంచి రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వచ్చి అక్కడ నుంచి నేరుగా గొల్లప్రోలు జగనన్న కాలనీకి చేరుకున్నారు. అక్కడ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు మర్రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్, ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌తో కలిసి బోటులో జగనన్న కాలనీ సందర్శనకు బయలుదేరారు. సుద్దగడ్డ వరద ముంపు బారినపడిన గొల్లప్రోలు పట్టణ శివారు జగనన్న కాలనీలో విస్తృతంగా పర్యటించారు. బోటులో వెళ్లి వరదనీటిలో, బురదమయంగా మారిన రహదారుల్లో నడుస్తూ జగనన్న కాలనీ వాసులను పలకరించి వారి కష్టాలను తీరుస్తానని భరోసా ఇచ్చారు. కాలనీవాసులతో మాట్లాడుతూ ముందుకు సాగారు. జగనన్న కాలనీకి వచ్చిన తర్వాత అష్టకష్టాలుపడుతున్నామని,కనీసం తాగునీరు అందడం లేదని, రోడ్లు, డ్రెయిన్లు లేవని, తమ పిల్లలు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పవన్‌కు మొరపెట్టుకున్నారు. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని, బ్రిడ్జి నిర్మించాలని, తాటిపర్తి రోడ్డుకు అనుసంధానంగా రోడ్డు నిర్మించాలని విన్నవించారు. అందరి కష్టాలు విని మీకు నేనున్నానంటూ భరోసా ఇచ్చారు.





బురదలో నడుస్తున్న పవన్.. బురదలోనే బాలుడితో మాట్లాడుతూ..

ఆరోగ్యం బాగాలేకున్నా వచ్చా : పవన్

మెట్టలో ఏలేరు, సుద్దగడ్డ వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. వరద ముంపు తగ్గగానే ఆ దిశగా కార్యాచరణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఆరోగ్యం సహకరించకున్నా వరద పరిస్థితిని సమీక్షించేందుకు తాను స్వయంగా వచ్చినట్టు తెలిపారు. జగనన్న కాలనీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు బ్రిడ్జి నిర్మాణం చేపడతామని చెప్పారు. వైఎస్సార్ జగనన్న కాలనీల పేరుతో గత ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజలు బలైపోయారన్నారు. వరద ప్రాంతాల సందర్శన అనంతరం పవన్ అత్యవసర సమీక్ష కోసం మంగళగిరి వెళ్లారు.



నీట మునిగిన ప్రాంతాలకు బోటులో వెళుతున్న పవన్



అధికారులకు పవన్ సూచనలు



విశేష అలంకరణలో విఘ్నేశ్వర స్వామి

సిద్ధి వినాయక స్వామికి పంచ హారతులు

అయినవిల్లి, సెప్టెంబరు 9: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధివినాయక స్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమం జరిపారు. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. విఘ్నేశ్వర స్వామికి పంచ హారతులు ఇవ్వగా భక్తులు తిలకించి తన్మయులయ్యారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది సేవలు అందించారు.

వీఆర్‌కు రామచంద్రపురం ఎస్ఐ వాసు!



రామచంద్రపురం (ద్రాక్షారామ), సెప్టెంబరు 9: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ఎస్ఐ పి.వాసును ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు వీఆర్‌కు పంపినట్టు సమాచారం. వైసీపీ ప్రభుత్వ హయాంలో పెదపూడి, బిక్కవోలు ఎస్ఐగా పనిచేసిన కాలంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని పలు ఇబ్బందులకు గురిచేసినట్టు వాసుపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయన్ను రామచంద్రపురం ఎస్ఐగా నియమించడంపై రామకృష్ణారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీంతో పోలీసు ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాల మేరకు ఎస్ఐ వాసును ఎస్పీ వీఆర్‌కు పిలిచినట్టు తెలిసింది.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

రాజానగరం, సెప్టెంబరు 9: నిరుద్యోగులైన యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పించే దిశగా ఉచిత శిక్షణ ఇస్తామని రాజానగరం సెర్ప్ ఏపీఎం కర్రి హేమనాగలక్ష్మి సోమవారం తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ రిపేర్, సర్వీస్‌తో పాటు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సెక్యూరిటీ కెమెరా సర్వీస్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. బుధవారం ప్రారంభమై నెల పాటు సాగే శిక్షణలో భోజన, వసతి సదుపాయం కల్పిస్తారన్నారు. కోర్సు పూర్తయిన తర్వాత సర్టిఫికెట్, బ్యాంకు లోన్ సహాయం అందిస్తారని చెప్పారు. పదో తరగతి పాస్/ఫెయిల్/ఆపైన విద్యార్హతలతో 18నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రాజమహేంద్రవరం ఐఎల్‌టీడీ జంక్షన్ వద్ద శిక్షణా తరగతులు నిర్వహిస్తారని, మరిన్ని వివరాలకు 77805 99939, 96523 04150 నెంబర్లలో సంప్రదించాలని ఏపీఎం కోరారు.



అటవీ శాఖ అధికారులు అమర్చిన ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత పులి

దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోనే

చిరుత పులి

తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి డీఎఫ్‌వో భరణి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 9: చిరుత పులి దివాన్‌చెరువు రిజర్వ్ అటవీ ప్రాంతంలోనే ఉన్నట్టు ట్రాప్ కెమెరాలో గుర్తించామని తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి అటవీ అధికారి ఎస్.భరణి తెలిపారు. సోమవారం కూడా ఈ ప్రాంతంలోనే చిరుత పులి పాదముద్రలు గుర్తించినట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిరుత పులి వల్ల అటవీ బయట ప్రాంతాల్లో మనుషులకు, పశువులకు ఎటువంటి హాని, ప్రాణ నష్టం జరగలేదన్నారు. ఆదివారం మాదిరిగానే చిరుత పులిని పట్టుకునేందుకు బోనులు ఏర్పాటు చేశామన్నారు. దివాన్‌చెరువు రిజర్వ్ అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచారాన్ని బట్టి ట్రాప్ కెమెరాలు అమరికలో మార్పులు చేశామని డీఎఫ్‌వో వివరించారు.



వై.రామవరం-యార్లగడ్డ రహదారి మధ్య వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

కొండవాగులు పొంగిపొర్లాయ్!

వై.రామవరం, సెప్టెంబరు 9: మండలంలోని బండిగడ్డ-సింగవరం మధ్య, యార్లగడ్డ-వై.రామవరం మధ్య, పెద ఊలెంపాడు, దాలిపాడు, గుర్తేడు వరకు ఉన్న కొండ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల గిరిజనులకు రాపోకలు పూర్తిగా స్తంభించాయి. చిన ఊలెంపాడు గ్రామంలోని ఒక వాగు వద్ద రెండు ఆవులు కొట్టుకుపోయినట్టు సమాచారం. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అధికారులు అప్రమత్తత చర్యలు చేపట్టారు. ఎంపీడీవో బాపన్నదొర, ఎస్ఐ సంతోష్‌కుమార్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది వాగుల వద్ద ఉండి ప్రజలను అప్రమత్తం చేశారు. వాగులకు అవతల, ఇవతల వైపు ఉన్న ప్రజలు, ఉద్యోగులు సైతం ఎక్కడి వారు అక్కడే ఉండిపోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

సీలేరు నది ఉగ్రరూపం



మోతుగూడెం, సెప్టెంబరు 9: మోతుగూడెంలో ఆదివారం రాత్రి నుంచీ కురుస్తున్న వర్షంతో డొంకరాయి రిజర్వాయర్ గేట్లు ఎత్తేయడంతో సీలేరు నదికి వరద ఉధృతి ఎక్కువైంది. ఆ నీరు మోతుగూడెం రహదారులపై ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మోతుగూడెం, కొల్లూరు రహదారి జలమయం అవడంతో రాకపోకలు నిలిచిపోయి పొల్లూరు పవర్ హౌస్‌కు వెళ్లే ఉద్యోగస్తులు అవస్థలు పడ్డారు.



లబ్బర్తి-అనంతగిరి మధ్య కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

ఉధృతంగా వాగులు... స్తంభించిన రాకపోకలు

రాజవొమ్మంగి, సెప్టెంబరు 9: మండలంలో ఆదివారం మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసింది. నెల్లిమెట్ల కాలనీ-లబ్బర్తి, రాజవొమ్మంగి-శాంతినగర్, మొల్లిమెట్ల-లాగరాయి, వట్టిగెడ్డ-ఎర్రంపాడు గ్రామల మధ్య రోడ్లపై ఉన్న కాజ్‌వేలపై కొండ వాగులు ఉధృతంగా ప్రవహించడంతో సుమారు 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. తహసీల్దారు కరక సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరేశ్వరావు, సీఐ సన్యాసినాయుడు వాగులను పరిశీలించారు. వాగుల వద్ద సిబ్బందిని పహారా పెట్టినట్టు అధికారులు తెలిపారు.



వరద ఉధృతికి కొట్టుకుపోయిన రహదారి

భారీ వర్షాల కారణంగా నెల్లిమెట్ల కాలనీ-లబ్బర్తి మధ్య ఆర్అండ్‌బీ రోడ్డుపై ఉన్న కాజ్‌వేపై వరద ఉధృతంగా ప్రవహించింది. సోమవారం సాయంత్రం తగ్గుముఖం పట్టిన తర్వాత కాజ్‌వే సమీపంలో కొట్టుకుపోయిన రహదారి బయటపడింది. వరద ఉధృతి తగ్గిన వెంటనే అధికారులు చర్యలు చేపట్టాలని బీజేపీ మండలాధ్యక్షుడు తాము సూరిబాబు కోరారు.



కాటన్ బ్యారేజీ నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

మళ్లీ ఉధృతం

కాటన్ బ్యారేజీ నుంచి 3.72 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, సెప్టెంబరు 9: ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరి ప్రవాహం మళ్లీ పెరుగుతోంది. ఇంద్రావతి, తాలిపేరు నుంచి వస్తున్న వరద నీటితో భద్రాచలం వద్ద నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. కుంట వద్ద శబరి నుంచి వస్తున్న వరద నీరు కలుస్తుండడంతో గోదావరి ఉరకలెత్తుతోంది. సోమవారం మధ్యాహ్నానికి భద్రాచలం వద్ద 25.30 అడుగులకు తగ్గిన నీటిమట్టం ఎగువ నుంచి ప్రవాహంతో సాయంత్రం ఆరు గంటలకు 29.60 అడుగులకు చేరు కుంది. ధవళేశ్వరం వద్ద తగ్గుతున్న నీటిమట్టం సోమవారం మధ్యాహ్నానికి ఏడు అడుగులకు చేరుకోగా సాయంత్రం ఆరు గంటలకు నిలకడగా ఉంది. 3,72,932 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది.



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో విజయవాడ-జగదల్‌పూర్ నడుమ ఉన్న ఎర్రబోరు గ్రామం వద్ద 30వ నెంబరు జాతీయ రహదారిని ముంచెత్తిన వరద నీరు

చింతూరును చుట్టుముట్టిన వరద

జలదిగ్బంధంలో మండలంలోని 22 గ్రామాలు

చింతూరు, సెప్టెంబరు 9: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు కుండపోత వర్షం ధాటికి సీలేరు కాంప్లెక్స్‌లోని జల విద్యుత్ కేంద్ర రిజర్వాయర్లు ఒక్కసారిగా నిండిపోయాయి. చింతూరు మండలంలోని డొంకరాయి రిజర్వాయరు నుంచి భారీగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ ప్రభావం చింతూరు మండలంపై పడింది. ఒక్కసారిగా వచ్చిపడిన వరద గ్రామాలను చుట్టుముట్టింది. వరద నీరు రహదారులపై వడిగా ప్రవహిస్తోంది. చింతూరు వద్ద శబరి నీటిమట్టం గంటల వ్యవధిలోనే పెరిగి సోమవారం రాత్రికి 41 అడుగులకు చేరింది. ఇటీవలి కాలంలో ఎన్నడూ లేని విధంగా శబరి పరవళ్లు తొక్కుతోంది. భద్రాచలం వద్ద 30 అడుగులకు చేరువలో గోదావరి ప్రవహిస్తోంది. గర్భిణులను నాటు పడవలపై చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్నారు. 22 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆంధ్ర-ఒడిశా నడుమ 326వ జాతీయ రహదారిపై చింతూరు మండలం నిమ్మలగూడెం, కుయుగూరు నడుమ వరద నీరు చేరింది. ఇక ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నడుమ సుక్మా జిల్లా ఎర్రబోరు వద్ద 30వ నెంబరు జాతీయ రహదారిపై వరద నీరు చేరింది. రాకపోకలు నిలిచిపోయాయి.



కల్లేరుకు చెందిన గర్భిణులను నాటు పడవలపై తరలిస్తున్న జాలర్లు

పరిమళించిన మానవత్వం

గోకవరం, సెప్టెంబరు 9: మనుషుల్లో మానవత్వానికి కొదవలేదని చెప్పేందుకు గోకవరంలో చోటుచేసుకున్న ఈ ఘటనే ఉదాహరణ. తూర్పు గోదావరి జిల్లా గోకవరం ప్రభుత్వాసుపత్రి వద్ద వృద్ధ దివ్యాంగుడు (రెండు కాళ్లు పనిచేయవు) కొద్ది రోజులుగా కడు దుర్భర స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. నిలువ నీడ లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎవరైనా దయతలిచి పెడితే కడుపు నింపుకుంటున్నాడు. లేకుంటే పస్తులుంటున్నాడు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కూడా ఆసుపత్రి బయటే ఓ పక్క తడుస్తూ మరో పక్క మూలుగుతూ ఒక ప్లాస్టిక్ కవరు కప్పుకుని బతుకు జీవుడా అంటూ కాలం వెళ్లదీస్తున్నాడు. ఆ వృద్ధుడి నిస్సహాయ స్థితి స్థానికుల ద్వారా పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాసరావుకు చేరింది. దీంతో ఆయన హుటాహుటిన సిబ్బందిని ఆసుపత్రి వద్దకు పంపించి వృద్ధుడిని సురక్షిత ప్రాంతానికి తరలించేలా చర్యలు చేపట్టారు. ఎటువంటి ఆహార లోటు లేకుండా ఏర్పాట్లు చేశారు. కాగా ఆ ముసలాయన తన సొంతూరు విశాఖపట్టణం అని చెప్తున్నాడు. వృద్ధుడి విషయంలో పంచాయతీ కార్యదర్శి చూపిన ఆదరణను పలువురు అభినందించారు.



వృద్ధుడిని సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న పంచాయతీ సిబ్బంది

పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలోకి వర్షపు నీరు



మోతుగూడెం, సెప్టెంబరు 9: తుఫాను ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న కుండపోత వర్షానికి సీలేరు కాంప్లెక్స్‌లోని జలాశయాలకు వరద నీరు భారీగా వచ్చి చేరుతుండటంతో అవి ప్రమాద స్థాయికి చేరుకున్నాయి. జెన్‌కో అధికారులు అప్రమత్తమై డొంకరాయి, గుంటవాడ జలాశయాల నుంచి భారీగా వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. డొంకరాయి పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు కాగా డొంకరాయి జలాశయానికి వలసగెడ్డ, పాలగెడ్డ, మంగంపాడు వాగుల నుంచి లక్షా పదివేల వరకు ఇన్‌ఫ్లోస్ వచ్చి చేరుతున్నాయి. జలాశయంలో 1,037 అడుగుల వద్ద నీటిమట్టం స్థిరంగా కొనసాగేలా చర్యలు చేపడుతూ ఏడు గేట్ల ద్వారా 1.10 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గుంటవాడ జలాశయానికి పిల్లిగెడ్డ వాగు నుంచి 23వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోస్ వచ్చి చేరుతుండటంతో ఐదు గేట్లు ఎత్తి దిగువకు 23వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గుంటవాడ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1,360 అడుగులు కాగా, 1359 అడుగుల వద్ద స్థిరంగా కొనసాగేలా జెన్‌కో అధికారులు చర్యలు చేపడుతున్నారు

కుండపోత వర్షానికి పొల్లూరు జల విద్యుత్ కేంద్రం కొండపైనుంచి వర్షపు నీరు కేబుల్ ట్రెంచ్‌ల ద్వారా టర్బైన్ ఫ్లోర్‌లోకి ప్రవహించింది. జల విద్యుత్ కేంద్రం వెనుక భాగంలో ఉన్న డీవాటరింగ్ పంప్ షెడ్ కూడా నీటిలో మునిగిపోయి సమస్య తలెత్తింది. జెన్‌కో అధికారులు అప్రమత్తమై టర్బైన్ ఫ్లోర్‌లోకి ప్రవేశించిన వర్షపు నీటికి అదనపు మోటార్లను అమర్చి జల విద్యుత్ కేంద్రానికి నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలోకి నీరు ప్రవేశించడంతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 9 గంటల వరకు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిపి వేయగా ఉదయం 9 గంటల తర్వాత రెండు యూనిట్లను వినియోగంలోకి తీసుకొచ్చారు.

పూర్తిస్థాయికి చేరువులో బలిమెల జలాశయం

సీలేరు కాంప్లెక్సులో అత్యంత పెద్దదైనది బలిమెల జలాశయం, దీని పూర్తిస్థాయి నీటిమట్టం 1516 అడుగులు కాగా ప్రస్తుతం 1510 అడుగులకు చేరింది. మరో ఐదు అడుగుల నీటిమట్టం పెరిగితే బలిమెల జలాశయం నుంచి గుంటవాడ జలాశయానికి నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గుంటవాడ జలాశయం నీటిమట్టం తగ్గించేలా జెన్‌కో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి

తొమ్మిదేళ్ల జైలు

ఏలేశ్వరం, సెప్టెంబరు 9: మానసిక వైకల్యం గల మహిళను 2016లో అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి తొమ్మిదేళ్ల జైలుశిక్ష విధిస్తూ సోమవారం న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని ఏలేశ్వరం ఎస్ఐ రామలింగేశ్వరరావు తెలిపారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం జె.అన్నవరం గ్రామానికి చెందిన మానసిక వైకల్యం ఉన్న మహిళ సమీపంలో ఉన్న తోట మణికంఠ ఇంటికి ఏకాదశి పూజల నిమిత్తం వెళ్లింది. అదే గ్రామానికి చెందిన పెయ్యల వీరబాబు తన కూతురిపై అక్కడ అత్యాచారానికి పాల్పడ్డాడని మహిళ తండ్రి అప్పట్లో ఫిర్యాదు చేశాడు. పెయ్యల వీరబాబు, తోట మణికంఠలపై అప్పట్లో ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో సీఐ అప్పారావు ఇద్దరిని అరెస్టు చేశారు. సుదీర్ఘమైన వాదనల అనంతరం పెయ్యల వీరబాబుకు తొమ్మిదేళ్ల జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 8వ అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి వై.బెన్నయ్యనాయుడు తీర్పు ఇచ్చారు.



ఆరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

నాలుగు నెలల పాటు ప్రయాణికుల సేవలో...

సామర్లకోట, సెప్టెంబరు 9: రైలు ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు, పండుగ రోజుల్లో వారికి మరింత మెరుగైన ప్రయాణ సదుపాయాలు కల్పించేందుకు సోమవారం నుంచి వివిధ ప్రాంతాలకు ఆరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సికింద్రాబాద్-విశాఖ (07097) డిసెంబరు 1 వరకు, విశాఖ-సికింద్రాబాద్ (07098) డిసెంబరు 2 వరకు రాకపోకలు సాగిస్తాయి.

సికింద్రాబాద్‌లో రాత్రి 8.35 గంటలకు బయల్దేరి నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా తెల్లవారుజామున 5.10 గంటలకు రాజమహేంద్రవరం, 5.43 గంటలకు సామర్లకోట, అక్కడి నుంచి అన్నవరం, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ మీదుగా విశాఖపట్టణం చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో విశాఖలో రాత్రి 7.50 గంటలకు బయల్దేరి దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి మీదుగా రాత్రి 9.36 గంటలకు అన్నవరం, రాత్రి 10.05 గంటలకు సామర్లకోట, 10.45 గంటలకు రాజమహేంద్రవరం అక్కడి నుంచి తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, మిర్యాలగూడ మీదుగా సికింద్రాబాద్ ఉదయం 11.15 గంటలకు చేరుతుంది.

తిరుపతి-శ్రీకాకుళం రోడ్ (07440) అక్టోబరు 10 నుంచి డిసెంబరు 1 వరకు, గల శ్రీకాకుళం రోడ్-తిరుపతి (07440), అక్టోబరు 7 నుంచి డిసెంబరు 2 వరకు రాకపోకలు సాగిస్తాయి.

తిరుపతిలో సాయంత్రం 5.10 గంటలకు బయల్దేరి రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు మీదుగా తెల్లవారుజామున 2.02 గంటలకు రాజమహేంద్రవరం, 2.57 గంటలకు సామర్లకోట, తెల్లవారుజామున నాలుగు గంటలకు తుని, అక్కడి నుంచి అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి మీదుగా అర్ధరాత్రి 12.15 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం రోడ్‌లో సాయంత్రం మూడు గంటలకు బయల్దేరి పెందుర్తి, దువ్వాడ, అనకాపల్లి మీదుగా రాత్రి 8.00 గంటలకు తుని, రాత్రి 8.58 గంటలకు సామర్లకోట, రాత్రి 9.45 గంటలకు రాజమహేంద్రవరం, అక్కడి నుంచి ఏలూరు, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట మీదుగా ఉదయం 8.20 గంటలకు తిరుపతి చేరుతుంది.

నాందేడ్-బెరహమ్‌పూర్ (07431) అక్టోబరు 12 నుంచి నవంబరు 30 వరకు, బెరహమ్‌పూర్-నాందేడ్ (07432) అక్టోబరు 13 నుంచి డిసెంబరు 1 వరకు రాకపోకలు సాగిస్తాయి.

నాందేడ్‌లో సాయంత్రం 3.25 గంటలకు బయల్దేరి ముద్‌ఖేడ్, ధర్మబాద్, బాసర, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చల్, సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, రాయనపాడు, ఏలూరు మీదుగా తెల్లవారుజామున 3.48 గంటలకు రాజమహేంద్రవరం, 5.38 గంటలకు సామర్లకోట, అక్కడి నుంచి అన్నవరం, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్, నౌపాడ, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం మీదుగా 2.45 గంటలకు బెరహమ్‌పూర్ చేరుతుంది.

తిరుగు ప్రయాణంలో బెరహమ్‌పూర్ నుంచి సాయంత్రం 4.45 గంటలకు బయల్దేరి ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, నౌపాడ, శ్రీకాకుళం రోడ్, చీపురుపల్లి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, అన్నవరం మీదుగా రాత్రి 11.30 గంటలకు సామర్లకోట, అర్ధరాత్రి 12.35 గంటలకు రాజమహేంద్రవరం, అక్కడి నుంచి తాడేపల్లిగూడెం, ఏలూరు, రాయనపాడు, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, కాజీపేట, సికింద్రాబాద్, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మబాద్, ముద్‌ఖేడ్ మీదుగా సాయంత్రం 3.45 గంటలకు నాందేడ్ చేరుకుంటుంది.

ఈ రైళ్లలో ప్రయాణించదలచిన వారు ఆయా స్టేషన్లలో బుకింగ్ కార్యాలయాల వద్ద రిజర్వేషన్ టిక్కెట్లు పొందవచ్చని రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు.

క్రేన్ రాడ్ జారి పడి యువకుడి మృతి



రామకృష్ణ గణేష్ (పాతచిత్రం)

నిడదవోలు, సెప్టెంబరు 9: క్రేన్ ముందు భాగంలో ఉన్న రాడ్ జారిపడి లారీ యజమాని మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం పందలపర్రు ర్యాంపులో ఇసుక లోడుతో ఉన్న భారీ లారీ బోల్తా పడింది. దానిని రెండు భారీ క్రేన్ల సహాయంతో పైకి లేపుతుండగా క్రేన్ ముందు భాగంలో ఉండే రాడ్‌లారీ బరువుకి ఒక పక్కకి ఒరిగిపోయి లారీ యజమాని అత్తిలి తారక రామకృష్ణ గణేష్ (28)పై పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో అతడిని స్థానికులు నిడదవోలులోని ప్రైవేటు ఆసుపత్రికి అనంతరం మెరుగైన వైద్య సేవలకు రాజమహేంద్రవరం తరలించగా మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం ఎస్ఐ రమేష్ చెప్పారు.

చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి



చిట్టిబాబు (పాతచిత్రం)

తాళ్లరేవు, సెప్టెంబరు 9: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన మత్స్యకారుడు గోపి చిట్టిబాబు (50) సోమవారం తెల్లవారుజామున చేపల వేటకు వెళ్లి మృతి చెందినట్టు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. ఆత్రేయ గోదావరి మేకల కాలువలో చేపలవేటకు వెళ్లిన చిట్టిబాబు వరిసి వల వేస్తూ ప్రమాదవశాత్తు కాలువలో మునిగిపోయాడు. గట్టుమీద ఉన్న దుస్తులు, బకెట్టు చూసిన స్థానికులు కాలువలోకి దిగి వెతకగా చిట్టిబాబు మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని కోరింగ పోలీసులు అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

జాతీయ నాయకుల చిత్రపటాల ఆవిష్కరణ

కొత్తపేట, సెప్టెంబరు 9: కొత్తపేట బాలుర ఉన్నత పాఠశాలలో ప్రముఖ జాతీయ నాయకుల చిత్రపటాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు బండారు సంజీవ్ హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మిబాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాసరావు, పల్లి శాంతి, వాసంశెట్టి సత్యనారాయణ, దేవపాటి వెంకటేశ్వరరావు, పాలూరి సత్యానందం, చిక్కం హనుమంతు, ముద్రగడ సుబ్బారావు, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృషి



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంచాయతీలకు ప్రకటించిన విరాళం చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ముమ్మిడివరం, సెప్టెంబరు 9: సుపరి పాలన, గ్రామ స్వరాజ్య స్థాపనకు నిరంతరం పాటుపడే వ్యక్తి పవన్‌కల్యాణ్ పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా రావడం రాష్ట్ర ప్రజలందరి అదృష్టమని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. వరద ప్రభావిత 400పంచాయతీలకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వ్యక్తిగతంగా విరాళం ప్రకటించారు. ఐ.పోలవరం మండలంలో 14పంచాయతీలకు, ఉప్పలగుప్తం మండలంలో 3పంచాయతీలకు, సఖినేటిపల్లి మండలంలో 3పంచాయతీల సర్పంచ్‌లకు రూ.లక్ష చొప్పున చెక్కులను ఎమ్మెల్యే దాట్ల అందజేశారు. ముమ్మిడివరంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో గోదశి పుండరీష్ అధ్యక్షతన జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, చెల్లి అశోక్, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, యేడిద శ్రీను, తాడి జానకీరామ్, దూడల స్వామి, ఇసుకపట్ల రఘుబాబు, దూడల స్వామినాయుడు, మద్దింశెట్టి పురుషోత్తం, మోకా బాలప్రసాద్, అత్తిలి బాబూరావు, లంకలపల్లి జమి, గాలిదేవర బుల్లియ్య, కర్రా దుర్గాప్రసాద్, మాదాల శ్రీధర్, పోలిశెట్టి కన్నా, గుద్దటి విజయ్, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాత సర్వే ప్రకారం రైల్వేలైన్ ఏర్పాటుచేయాలి



రైల్వేలైన్ మార్పు కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నగరం సర్పంచ్ రమణకుమారి తదితరులు

మామిడికుదురు, సెప్టెంబరు 9: పాత సర్వే ప్రకారం రైల్వేలైన్ ఏర్పాటు చేయాలంటూ నగరం గ్రామస్తులు సోమవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. పది వేల జనాభా కలిగిన నగరం గ్రామం మీదుగా రైల్వేలైన్ ఏర్పాటు చేయడం వల్ల పేదలకు చెందిన భూములు, ఇళ్ల కోల్పోతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. గతంలో చేసిన పాత రైల్వేలైన్ ప్రకారం లైన్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం ద్వారా కోరారు. కొత్త లైను వల్ల నగరం గ్రామంలోని 73ఎకరాల పంట భూములు, గ్రామంలోని పలు రోడ్లకు నష్టం ఏర్పడుతుందన్నారు. పాత రైల్వేలైన్ ప్రకారం లైను ఏర్పాటుచేస్తే తమ గ్రామానికి ఏవిధమైన నష్టం వాటిల్లదని కోరుతూ వినతిపత్రాన్ని కలెక్టర్‌తో పాటు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు, స్థానిక రెవెన్యూ అధికారులకు అందించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జాలెం రమణకుమారి, స్థానిక నాయకులు జాలెం సుబ్బారావు, ముక్రం హుస్సేన్, కోళ్ల సురేష్‌బాబు, జేటీ తదితరులు పాల్గొన్నారు. నగరంలో సోమవారం చేపడుతున్న కొత్త రైల్వేలైన్ సర్వే పనులను స్థానికులు అడ్డుకున్నారు.

ఓడలరేవు బీవీసీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు ఇంజనీరింగ్ పట్టాలు అందిస్తున్న వైస్‌చాన్సలర్ కేవీ రమణ

అల్లవరం, సెప్టెంబరు9: ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో 2020-24 బ్యాచ్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. బీవీసీ విద్యా సంస్థ మల్టీనేషనల్ కంపెనీలో అత్యధిక ప్యాకేజీలతో కొలువులు సాధిస్తున్న విద్యార్థులను తయారు చేస్తోందని జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ డాక్టర్ కేవీ రమణ ప్రశంసించారు. ఓఎన్‌జీసీ చీఫ్ జనరల్ మేనేజర్ జి.భాస్కరరావు పట్టభద్రులను అభినందించారు. విద్యార్థులకు ఇంజనీరింగ్ పట్టాలను అందజేశారు. బీవీసీ విద్యాసంస్థల అధినేత బోనం కనకయ్య, డాక్టర్ బోనం కనకదుర్గ, చైర్మన్ బోనం కృష్ణసతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ఏ చంద్రమౌళి, బీవీసీఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజే రామారావు, ప్రొఫెసర్ బి.శ్రీనివాస్ పట్టభద్రులను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.ప్రవీణ్, టీవీ జనార్ధనరావు, ఏవైఆర్వీ ప్రసాద్, ఎస్.శివకుమార్, వై.రమణమూర్తి, ఎస్.శ్రీకాంత్, ఎన్.వాసుదేవరావు, అడబాల రామకృష్ణ, ఏ.దుర్గామాధురి, బీఎస్ఎన్ మూర్తి, సుభాష్, మీరాషరీఫ్ పాల్గొన్నారు.

యానాం సమస్యలు పరిష్కరించండి: మల్లాడి



యానాం, సెప్టెంబరు 9: యానాం నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. పుదుచ్చేరి కలెక్టర్ కులంగోత్తన్‌తో సమావేశమయ్యారు. యానాం కనకాలపేటలో ఉన్న పిప్‌డిక్ భూవివాదాన్ని త్వరితగతిన పరిష్కరించాలని, యానాంలో ఇసుక సమస్యను, దీపావళి షాపులకు లైసెన్సుల జారీ అంశాలతో పాటు యానాం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్ పోస్టు నియామకం తదితర పెండింగ్ అంశాలపై చర్చించారు. దేవదాయశాఖ కమిషనర్‌తో సమావేశమయ్యారు. ప్రస్తుతం జరుగుతున్న యానాం వెంకన్న ఆలయ పునర్నిర్మాణ కమిటీ కాల పరిమితిని మరోఏడాది పొడిగించేలా సీఎం జారీ చేసిన ఆదేశాలను కమిషనర్‌కు అందజేశారు. అలాగే పెండింగ్ అంశాలపై చర్చించారు. అనంతరం పుదుచ్చేరి సహకారశాఖ, అటవీశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఆ శాఖల సమస్యలను వివరించి పరిష్కరించాలని మల్లాడి కోరారు.

విక్టరీ అకాడమీ విద్యార్థుల ప్రతిభ

అమలాపురం టౌన్, సెప్టెంబరు 9: రాజమహేంద్రవరంలో బీఎన్‌కేయూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో అమలాపురం విక్టరీ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈపోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి 200మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విక్టరీ అకాడమీకి చెందిన ద్రాక్షారపు సాత్విక్ రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించి రూ.5వేలు నగదు బహుమతి గెలుచుకున్నాడు. అండర్-13 విభాగంలో తాడి వెంకటేష్ ప్రథమస్థానం సాధించి రూ.5వేలు, అండర్-15 విభాగంలో అరిగెల జయప్రకాష్ ద్వితీయస్థానం, బండారు నానిబాబు తృతీయ స్థానాలు సాధించినట్టు అకాడమీ ప్రిన్సిపాల్ టీవీ సురేష్‌కుమార్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహక బహుమతులతో పాటు రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రతినిధులు షీల్డులు అందజేశారు.

గ్రామాభివృద్ధి కోసం చెక్కులు అందజేత

అంతర్వేది, సెప్టెంబరు 9: అంతర్వేది, అంతర్వేది దేవస్థానం పంచాయతీలకు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు నుంచి సోమవారం అంతర్వేది సర్పంచ్ పోతురాజు నరసింహారావు (కిశోర్), ఎంపీటీసీ చొప్పల బాబూరావులు రూ.లక్ష చెక్కును సోమవారం అందుకున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గ్రామ పంచాయతీకి ప్రకటించిన రూ.లక్ష చెక్కును అందుకున్నసందర్భంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి శ్రేణులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అంతర్వేది దేవస్థానం చెక్కును సర్పంచ్ జాన్‌బాబు అందుకున్నారు. కార్యక్రమంలో గుబ్బల ఫణికుమార్, ఎంపీటీసీ బైరా నాగరాజు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి నవరాత్రి వేడుకలు

రావులపాలెం, సెప్టెంబరు 9: మండలంలోని గ్రామాల్లో గణపతి నవరాత్రి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని గ్రామాల్లో ముఖ్య కూడళ్ల వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక మండపాల్లో ఉదయం, సాయంత్రం గణపతికి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యువకుడి ప్రాణాలను రక్షించిన సీఐ సాగర్

ఆలమూరు, సెప్టెంబరు9: జొన్నాడ బ్రిడ్జిపై సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న యువకుడిని అటుగా వెళుతున్న రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ పట్టుకుని ఆలమూరు పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. కడియం మండలం పొట్టిలంక గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి మహేష్‌కుమార్ జొన్నాడ వద్ద గౌతమి బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకడానికి సిద్ధమయ్యాడు. దీంతో హైవే పెట్రోలింగ్ సిబ్బంది సాయంతో సీఐ విద్యాసాగర్ యువకుడిని పట్టుకున్నారు. మణికుమార్ మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో అతడి అన్నకు సమాచారం అందించారు. విచారణ అనంతరం సోదరుడు ఆదిమూలం దుర్గాప్రసాద్‌కుమార్‌కు అప్పగించారు. తమ్ముడు మణికుమార్ ప్రాణాలను రక్షించిన సీఐ విద్యాసాగర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధే లక్ష్యంగా కూటమి పాలన: మంత్రి సుభాష్

ద్రాక్షారామ, సెప్టెంబరు9: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడును అక్రమ అరెస్టు చేసి ఏడాది పూర్త యిందని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. అభివృద్ధి, సంక్షేమం సామాజిక న్యాయం ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నీతి, నిజాయితీ, చట్టబద్ధత, పారదర్శకత చంద్రబాబు ప్రత్యేకతన్నారు. చంద్రబాబును అరెస్టు చేస్తే దేశంలోని అన్ని పార్టీలు ఖండించాయన్నారు. 70దేశాల్లో సంఘీభావ ప్రదర్శనలు చేశారన్నారు. జగన్ తన లూటీ నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి అక్రమ కేసులు నమోదు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం నవ్యాంధ్ర ప్రదేశ్ పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు.

పారదర్శక పాలన చంద్రబాబు ప్రత్యేకత

కొత్తపేట, సెప్టెంబరు 9: నీతి నిజాయితీ, చట్టబద్ధత, పారదర్శక పాలన సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేకతని జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి అన్నారు. సోమవారం కొత్తపేటలో ఆమె మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టు జరిగి నేటితో ఏడాది పూర్తయిందని, అన్ని వర్గాల ప్రజలు దీనిని తీవ్రంగా ఖండించారన్నారు. ఏనాడు చంద్రబాబు రాష్ట్ర భవిష్యత్‌కు విరుద్ధంగా పని చేయలేదని, అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం ధ్యేయంగా పాలన చేశారన్నారు. అక్రమ అరెస్టు జరిగినప్పుడు సుమారు 70 దేశాల్లో చంద్రబాబు కోసం సంఘీభావ ప్రదర్శన చేశారన్నా రు. ఎటువంటి ఆధారం లేకపోయిన జగన్‌మోహన్‌రెడ్డి అక్ర మంగా అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు.

వరద సహాయక చర్యల్లో ఎమ్మెల్యే



విజయవాడలో వరద బాధితులకు బియ్యం, నిత్యావసరాల పంపిణీ

పి.గన్నవరం, సెప్టెంబరు 9: ఎమ్మెల్యే గిడ్డి సత్యనా రాయణ విజయవాడలో వరదముంపు ప్రాంతాల్లో పర్యటించారు. విజయవాడ వెస్ట్ 46వ డివిజన్ చిట్టినగర్‌లో బాధిత కుటుంబాలను పరామర్శించి అందుతున్న సాయంపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బియ్యం, నిత్యావసరాలను బాధిత కుటుంబాలకు అందించారు. స్థానికంగా డ్రైనేజీల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించే పనులను ఆయన పర్యవేక్షించారు. స్థానిక అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వరదలపై సమీక్ష

ఆత్రేయపురం, సెప్టెంబరు 9: తహశీల్దారు కార్యాలయంలో వరదలపై సోమవారం వివిధ శాఖల అధికారులతో తహశీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీతో నాతి బుజ్జి సమీక్షించారు. అధిక వర్షాలకు కలిగిన నష్టాలపై శాఖల వారీగా సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు.

నష్టపరిహారం అందించి ఆదుకోండి

ఉప్పలగుప్తం,సెప్టెంబరు9: సార్వా సీజన్‌లో ప్రారంభ దశలోనే ముంపు ముప్పుతో నూరు శాతం నష్టం జరిగిందని ఉప్పలగుప్తం, వానపల్లిపాలెం గ్రామాల రైతులు సోమవారం అధికారులకు విన్నవించారు. నారు మళ్ల సిద్ధం చేసుకుని, పొలాన్ని రెండు సార్లు దమ్ము చేసుకుని నాట్లు వేద్దామనుకుంటున్న సమయంలో అధిక వర్షాలకు ముంపు ముప్పు ఏర్పడిందని రైతులు వాపోయారు. సార్వాలో నాట్లు వేయకుండానే వేలాది రూపాయల నష్టం జరిగిందని, దాళ్వా సాగు చేయాలంటే పెట్టుబడి ఎక్కడ నుంచి తేగలమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి రైతులకు సార్వా నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రాలు సమర్పించారు. రైతు నాయకుడు చిక్కం పెద్దబ్బులు ఆధ్వర్యంలో జొన్నగంటి రామకృష్ణారావు, యాళ్ల వెంకటేశ్వరరావు, చిక్కం వెంకయ్యనాయుడు, బి.కృష్ణ వినతిపత్రం సమర్పించారు.

వరద బాధితులకు రూ.7.20లక్షల సాయం



మండపేట, సెప్టెంబరు 9: విజయవాడ వరద బాధితుల కోసం ఆలమూరు తాలుకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అం దించిన రూ.5లక్షలు, మండపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అందించిన రూ.1.5లక్షలు, మండపేట లయన్స్ క్లబ్ అం దించిన రూ.70వేలు మొత్తం కలిసి రూ.7.20లక్షలను సీఎం చంద్రబాబునాయుడును మం డ పేట, అమలాపురం ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, అయి తాబత్తుల ఆనందరావు కలిసి సోమవారం అందజేశారు.

వరద నీరు దిగేందుకు చర్యలు

అంతర్వేది, సెప్టెంబరు 9: సఖినేటిపల్లిలంక గాంధీనగర్ ఇందిరమ్మ కాలనీలో సర్పంచ్ రేఫూరి రాజేశ్వరి ఏసునరసింహరాజు, కూటమి శ్రేణులు సోమవారం పర్యటించారు. కాలనీ పూర్తిగా నీట మునగడంతో ముంపు, వరద నీరు బయటికి వెళ్లేందుకు మరమ్మతు పనులు చేపట్టారు. కార్యక్రమంలో కొండా కిశోర్, గునిశెట్టి రాంజీ, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

నెల రోజులైనా దోషులను అరెస్టు చేయలేదు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 9: కోల్‌కతా ఆర్జీకర్ ఆసుపత్రిలో మహిళా వైద్యురాలిపై పాశవికంగా అత్యాచారం చేసి హత్య చేసిన దోషులను ఇంత వరకు అరెస్టు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఆలిండియా గైనకాలజిస్ట్స్ అండ్ అబ్‌స్టెట్రీషియన్స్ అసోసియేషన్ పిలుపు మేరకు అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో మహిళా వైద్యులు, మహిళా వైద్య సిబ్బంది సోమవారం నిరసన తెలిపారు. హత్యాచారం చేసిన దోషులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. మహిళా సిబ్బంది పనిచేసేచోట భద్రతా చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు. ప్లకార్డులతో గడియార స్తంభం సెంటర్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. మహిళా వైద్యులు శారద, గిరిజ, మాధవి, స్మిత, స్రవంతి, శిల్ప, రాధిక, భానుమతి పాల్గొన్నారు.

చిన్నారులకు 7కిలోల వెండితో తులాభారం



ఆత్రేయపురం, సెప్టెంబరు 9: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో రాజమహేంద్రవరం దేవీచౌక్‌కు చెందిన కొత్త నాగవెంకట సత్యనారాయణ- లక్ష్మి దంపతులు వెండి తులాభారం సమర్పించారు. స్వామివారి అనుగ్రహంతో వారికి కవల పిల్లలు (పాప, బాబు) జన్మించడంతో సోమవారం దంపతులు రూ.6.30లక్షల విలువైన 7కిలోల వెండితో తులాభారం నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. ఉపకమిషనరు భూపతిరాజు కిశోర్‌కుమార్ దాతలకు స్వామివారి చిత్రపటం అందించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,05,183 లభించింది.


భార్యాభర్తలపై దాడి

కాట్రేనికోన, సెప్టెంబరు9: తనపైన, భర్త విష్ణుమూర్తిపైనా పెమ్మాడి వెంకట్రావు కుటుంబ సభ్యులు కొట్టారని కందికుప్పకు చెందిన విత్తనాల వరలక్ష్మి సోమవారం పోలీసులకు ఫిర్యాదుచేసింది. తమకు, పెమ్మాడి కుటుంబ సభ్యులకు మధ్య సరిహద్దు తగాదా ఉండగా కోర్టు తమకు అనుకూలంగా ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. కేసు విచారణకు వచ్చిన సమయంలో వెంకట్రావు, అతని కుటుంబ సభ్యులు ఆదివారం మద్యం సేవించి తమపై దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపించారు.

శిలాఫలకం ధ్వంసం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 9: నల్లూరులో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. గ్రామశివారు మురికి కాలువ వంతెన సమీపంలో వైసీపీ ప్రభుత్వం హయాంలో అంగర, టేకి, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి నల్లూరు మీదుగా కాలేరు, వెదురుమూడి, ఆర్అండ్‌బీ రోడ్డు వరకూ రూ.83.10లక్షల నాబార్డు నిధులతో బీటీ రోడ్డు నిర్మాణానికి 2024 మార్చిలో శంకుస్థాపన చేశారు. ఈశిలాఫలకాన్ని ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు.

మెడిసిన్ సీట్లు సాధించిన నవోదయ విద్యార్థులు



యానాం, సెప్టెంబరు 9: పుదుచ్చేరిలోని ఇందిరా గాంధీ మెడికల్ కళాశాలలో యానాం పీఎం జవహర్ నవోదయ విద్యార్థులు బాలజీలాస్య, ఎల్.సాయినాయుడు, ఎన్.విజ్ఞాశ్రీ, ఎం.శివకాశి మెడిసిన్ సీట్లు సాధించారని ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. వీరినికళాశాల ప్రతినిధులు అభినందించారు. కళాశాల విద్యార్థులు దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన కళాశాలల్లో ప్రవేశం పొందా రన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషి ఉందన్నారు.

తాడి నరసింహారావు పుట్టినరోజు వేడుకలు



తాడి నరసింహారావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు తదితరులు

ముమ్మిడివరం, సెప్టెంబరు 9: టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, వ్యాపారవేత్త తాడి నరసింహారావు పుట్టినరోజు వేడుకలను సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య అట్టహాసంగా జరుపుకున్నారు. ముమ్మిడివరంలోని టీటీఆర్ నగర్‌లోని ఆయన స్వగృహంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానుల మధ్య భారీ కేక్‌ను కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. రాష్ట్రం, జిల్లాలోని కూటమి నాయకులు పలువురు ఫోన్‌లో నరసింహారావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పలువురు పుష్పగుచ్ఛాలు, పూలమాలలతో నరసింహారావుకు శుభాకాంక్షలు తెలిపారు. గుత్తుల సాయి, నాగిడి నాగేశ్వరరావు, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, పొద్దోకు నారాయణరావు(బాలు), అర్ధాని శ్రీనివాసరావు, దాట్ల బాబు, యాళ్ల ఉదయ్, అడబాల సతీష్‌కుమార్, గుద్దటి జమి, గోదశి పుండరీష్, కర్రా దుర్గాప్రసాద్, దూడల స్వామినాయుడు, ములపర్తి బాలకృష్ణ, దొమ్మేటి రమణకుమార్, యేడిద రాంబాబు, నిమ్మకాయల రాజా, కట్టా సత్తిబాబు, పిల్లి నాగరాజు, కడలి నాగు, సత్తి నూకరాజు, సానబోయిన చంటి, కుంచనపల్లి నారాయణ, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, గోదశి గణేష్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వాలు వేగవంతం చేయాలి

అంబాజీపేట, సెప్టెంబరు 9: బీజేపీ సభ్యత్వాలు గ్రామాల్లో వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు అన్నారు. మొసలపల్లిలో నియోజకవర్గ కన్వీనర్ చీకురమిల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో అత్యధిక సభ్యత్వాలు నమోదు కావాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, జిల్లా కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, గనిశెట్టి వెంకటేశ్వరరావు, ఈశ్వరగౌడ్‌చ కొపనాతి శ్రీరామచంద్రమూర్తి, పేరాబత్తుల సుబ్బారావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జుల్జన

మామిడికుదురు, సెప్టెంబరు 9: కర్బలా పుణ్యభూమిలో ఇమామ్ హుస్సేన్‌కు సహకరించి నిస్వార్థ సేవలు అందించిన ఆయన గుర్రం జుల్జనకు ముస్లింలు ఘన నివాళులర్పించారు. స్థానిక మంజిలే కర్బలా నుంచి గుర్రాన్ని ప్రత్యేకంగా అలంకరించి పెదపంజీష వరకు మాతం నిర్వహిస్తూ ఊరేగింపు చేశారు. అంజుమానే పర్వానాయేహుస్సేన్ భక్తబృందం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మత ప్రబోధకుడు షమీమ్‌రజారజ్వీ పాల్గొని మజ్లిస్ ఆలపించారు. కార్యక్రమంలో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి మాతం నిర్వహిస్తూ కర్బలా అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు.

15లీటర్ల సారా స్వాధీనం

మండపేట,సెప్టెంబరు9: రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యికి చెందిన మారిశెట్టి వీరవెంకటసత్యనారాయణ మోటార్‌సైకిల్‌పై 15లీటర్ల సారా తరలిస్తుండగా ద్వారపూడి సమీపంలోని వేములపల్లి వద్ద మండపేట రూరల్ ఎస్ఐ సురేష్‌కుమార్ అరెస్టుచేశారు. సారా స్వాధీనంచేసుకుని, బైక్‌ను సీజ్‌చేశారు. అతడికి ఆలమూరు కోర్టు రిమాండ్ విధించిందని ఎస్ఐ తెలిపారు. హెచ్‌సీ నారాయణ, కానిస్టేబుళ్లు సత్యనారాయణ, సతీష్, హోంగార్డు శ్రీను పాల్గొన్నారు.

పామర్రులో సామూహిక సీమంతాలు

కె.గంగవరం, సెప్టెంబరు 9: పామర్రు ఆసుపత్రి వద్ద సోమవారం గ్రామానికి చెందిన శ్రీరామ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 75మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. ప్రతీ గర్భిణికి మహారాణీ కిరీటాలు అలంకరించారు. పూలు, పండ్లు, గాజులు, చీర, పసుపు కుంకుమ, స్వీట్లు అందజేసి ఘనంగా సీమంతాలు చేశారు. అనంతరం విందు భోజనం పెట్టారు. శ్రీరామ్ సేవా సంస్థ సభ్యులు, దాతలు చెలు బోయిన శ్రీనివాసు, ఏడిదబ నాగరాజు, మాటూరి వాసు, చౌటపల్లి పుల్ల య్య, పోలిశెట్టి వెంకట్రావు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

శిథిలమైన భవనాలకు ప్రతిపాదనలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 9: ముమ్మిడివరంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనం శిథిలావస్థకు చేరడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు పైశ్లాబు పెచ్చుపెచ్చులుగా ఊడిపోయింది. శిథిలమైన భవనాన్ని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సోమవారం పరిశీలించారు. నూతన భవన నిర్మాణానికి రూ.కోటితో ప్రతిపాదనలు రూపొందించి అందించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి అర్ధాని సత్యనారాయణను ఆదేశించారు. ముమ్మిడివరంలో శిథిలావస్థకు చేరుకున్న తహశీల్దార్, పోలీసుస్టేషన్, సబ్‌ట్రెజరీ కార్యాలయ భవనాలను కూడా ఎమ్మెల్యే పరిశీలించారు. వాటిస్థానే నూతన భవన నిర్మాణాలకు అంచనాలు రూపొందించాలని తహశీల్దార్ ఎం.సుబ్బలక్ష్మి, సీఐ ఎం.మోహన్‌కుమార్‌లకు సూచించారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, అర్ధాని శ్రీనివాసరావు, పొద్దోకు నారాయణరావు, చిక్కాల అంజిబాబు ఉన్నారు.

పాఠశాలకు రూ.5లక్షల విలువైన ల్యాప్‌టాప్స్ బహూకరణ



రాయవరం, సెప్టెంబరు 9: పసలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం పాఠశాల 1984-89 పూర్వవిద్యార్థి, ఎన్ఆర్ఐ సత్తి ప్రతాపరెడ్డి రూ.5లక్షల విలువైన 6 ల్యాప్‌టాప్స్, ప్రింటర్‌ను బహూకరించారు. దాత తరపున పాఠశాల పూర్వవిద్యార్థి సత్తి వీరరాఘవరెడ్డి కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. హెచ్ఎం నూలు ఆదినారాయణ, చింతా తాతారెడ్డి, మల్లిడి సాయిబాబారెడ్డి, కుక్కల శ్రీనివాసరావు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

వసతిగృహాన్ని తనిఖీచేసిన జూనియర్ సివిల్ జడ్జి

ముమ్మిడివరం, సెప్టెంబరు 9: ముమ్మిడివరం మండల లీగల్‌సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా ముమ్మిడివరంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహం రాణేలంక గురుకుల పాఠశాల వసతిగృహాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. వసతిగృహంలో ఎంతమంది పిల్లలు ఉన్నారు, ఆర్డినెన్స్ రిజిస్టర్‌లో నమోదైన పిల్లలు వసతిగృహంలో ఉన్నారా లేదా, స్టాకు ఉందా లేదా, స్టాకు రిజిస్టర్‌ను, ఆ ఫీసు రిజిస్టర్‌ను, పిల్లలు నిద్రించే వసతిగృహాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచనలిచ్చారు.

గ్రామాల్లో ప్రజా ఆరోగ్య రక్షణ చర్యలు చేపట్టాలి

అల్లవరం, సెప్టెంబరు 9: కురుస్తున్న భారీ వర్షాలకు అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ప్రజా ఆరోగ్య రక్షణ చర్యలు చేపట్టాలని ఎంపీడీవో బీఎస్ఎన్ కృష్ణమోహన్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. క్లోరినేషన్, తాగునీరు తదితర అంశాలపై శ్రద్ధ చూపాలన్నారు.